కథ 2007

5



# కొత్త నీరు

విహారి

బయట చల్లగానే ఉంది. లోపలే సెగలూ పొగలూ. బయట ఆహ్లాదకరంగానే ఉంది. లోపలే ముసురుపట్టింది. బయటంతా విశాలంగా ఉంది. లోపలే ఇరుగ్గా ఉంది.

రాత్రి తొమ్మిదవుతోంది.

ఇంట్లో సాయంత్రం ఆరుగంటలకి మొదలైన అంతర్యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. రోజూ ఈపాటికి నాన్న టిఫిన్ అయిపోతుంది. ఇవాళ టిఫిన్‌కి రమ్మని అమ్మ రెండుసార్లు పిలిచినా రెండుసార్లూ ముభావంగా, 'నాకివాళ టిఫిన్ అక్కర్లేదు,' అని ఒక్క ముక్కలోనే తన నిరసనని తెలియజేశాడు.

వంట చేసిపెట్టి ఎప్పుడో వెళ్లిపోయింది సుభద్రమ్మ. అమ్మకి కీళ్లనొప్పులూ, స్పాండిలైటిస్, ఆయాసం రావడంతో ఓ ఏడాది నుంచి వంటకి సుభద్రమ్మ ఏర్పాటు జరిగింది. ఆమె పగలూ రాత్రీ వంట చేసిపెట్టి వెళ్లిపోతుంది. నాన్నకి షుగరుంది. బి.పి. ఉంది. సమయానికి ఆయనకి అన్నీ అమర్చటం అమ్మకొక నియమం. ఇవాళ పరిస్థితి ఇదిగో... ఇలా ఉంది. ఇల్లంతా మూర్ఛబోయిన వాతావరణం.

హాల్లో నేనూ, అమ్మా, నాన్నా, కుడివైపు గదిలో నా శ్రీమతి సరళ టి.వి. ఛానెళ్లు మారుస్తోంది. ఆమె మనస్సు కూడా ఈరోజు సీరియల్ మీద లేనట్టుంది. ఎడమవైపు గదిలో నా కూతురు మాధవి... కంప్యూటర్ ముందు కూర్చుని ఏదో చేస్తోంది.

ఎవరి మనసుల్లోనూ ప్రశాంతత లేదు. నిశ్శబ్దం ఘనీభవించినట్లు ఉంది. పక్షవాతం మొదలైతే కనపడే లక్షణాలు ఇంటిని పట్టుకున్నట్టనిపిస్తోంది.

విషయాన్ని నాన్నే తెగలాగుతున్నాడా? ఒక చిన్న సందేహపు చినుకు- నా గుండెలో.

ఇంతకీ జరిగిందేమిటి?

*

వి.టి. పార్క్ దగ్గరికి ఎవడో టాటూస్ వేసేవాడొస్తే పచ్చబొట్టు బొమ్మొకటి తన చేదండ మీద వేయించుకొచ్చింది మాధవి. అది చూసి అగ్గిరాముడయ్యాడు నాన్న.

"చూట్టానికి పరమ అసహ్యంగా ఉంది. రోత పుడుతోంది. స్లీవ్‌లెస్ డ్రెస్ చేతిపైన ఈ బొమ్మలేమిటి... కింద ముంజేయి పైదాకా మెహిందీ డిజైన్లేమిటి... వికారంగా ఉంది," అంటూ తిట్లూ, చివాట్లూ. శివమెత్తినట్టు ఊగిపోయాడు.

మాటల మధ్యలో మా ఆవిడకీ నాలుగు వడ్డించాడు. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చి చిరాగ్గా ఉన్నట్లుంది. తానూ ఒంటికాలి మీదే లేచింది.

"మాధవి చిన్నపిల్ల కాదు. నాలుగు దెబ్బలేసి చెప్పటానికి. నా అంతయి నాకంటే ఎక్కువే సంపాదిస్తోంది. చెప్పారు కదా. అదే అర్థం చేసుకుంటుంది," అన్నది. ఆమె సమాధానం నాన్నకు రుచించలేదు.

సరళని బలపరుస్తున్నట్టు నేనూ, "నో ఇష్యూ నాన్నా. మాధవి కంప్యూటర్ ఇంజనీర్. పైగా ఆ బొమ్మలేవో వాషబులే. సరదా తీరాక చెరిపేసుకుంటుంది లెండి. లెట్ అజ్ ట్రీట్ హర్ యాజ్ యాన్ అడల్ట్," అన్నాను.

నావైపు చాలా గుర్రుగా చూశాడు నాన్న. ఓ వెయ్యిసూదులు కళ్లల్లోకి గుచ్చినట్టయింది. "కొంత

మంది ఎంత వయసొచ్చినా మైనర్లే. ఎందుకు పని కొస్తార్రా- కూతుర్ని అదుపు చేసుకోలేని వెధవలు,'' అని తనదైన ఫక్కీలో కరుగ్గానే అన్నాడు. ఆయన మాటతీరు అంతే. సన్నగా నవ్వేసుకుని ఏదో మేగజైన్ అందుకున్నాను.

అప్పుడే అమ్మ ప్రవేశించింది ఈ ఘట్టంలోకి. నాకంటే, సరళ కంటే ఆమె ఒక ఆకు ఎక్కువే చదివింది. ''మాధవి చెట్టంత పిల్ల. దానిపై అలా రంకెలేస్తే ఎలా? ఏ నేరమో పాపమో చేసినట్టు అంకమ్మ శివాలెందుకు? కొడుకూ కోడలూ చిన్నపిల్లలా ఏమిటి? మర్యాద లేకుండా బడిపిల్లల్ని అన్నట్టు అనేయటమేనా? అంత చదువూ... పొద్దున్నే ఆ ఆధ్యాత్మిక కార్యక్రమాలూ ఎందుకుట? నోటికి కొంచెం నిగ్రహం ఉండొద్దూ,'' అన్నది.

అమ్మ మాటలు నాన్న మనసుని బాగా గాయ పరచినట్లున్నాయి. అప్పటి నుంచీ బిగుసుకుపోయాడు.

ఏడవుతుండగా కాబోలు మాలతి వచ్చింది. నా మేనకోడలు. పైనే అపార్ట్‌మెంట్. సెక్రటేరియట్‌లో ఉద్యోగం. వాళ్లాయన విష్ణు. ఏదో కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్. వాళ్ల బాబు రవి ఐదేళ్లవాడు. అమ్మ రవి గురించి అడిగితే, ''వాడు ఇంటికొచ్చాడంటే టి.వి.లో జెటిక్స్‌కో, సిన్‌కో అంటుకుపోతాడు అమ్మమ్మా,'' అంది.

నాన్న మాలతి వైపు ఓ చురుకు చూపు చూశాడు. ఆమె పిచ్చాపాటి మొదలెట్టింది కానీ సాగలేదు. జ్వర మొచ్చిన ఇంట్లో, 'ఊఁ... ఆఁ' మూలుగులు తప్ప సంభాషణేం జరుగుతుంది! ఆ కొంచెం సణుగుడులోనే జరిగిందేమిటో అర్థమైంది మాలతికి.

ఆమె చాలా సీరియస్‌గా అన్నది. ''మాధవయినా, మాలతయినా ఆడపిల్లలంటే అందరికీ అలుసులే మామయ్యా. ఆమె వ్యక్తిత్వాన్నీ, అభిరుచినీ, దేన్నీ గౌరవించలేరు. ఈ పురుషాధిక్యతతో చస్తున్నా మనుకో,'' అని సన్నగా నవ్వింది. తనని ఉద్దేశించే అన్నట్టు అర్థమయ్యింది నాన్నకి. ఆమె వెళ్లిపోయింది.

తన చిరాకుని బయటపడేశాడు నాన్న. స్త్రీవాదం గురించీ, ఈ కాలపు ఆడపిల్లల్ని గురించీ చాలాసేపు మాట్లాడుతూనే ఉన్నాడు. ''టి.వి. సీరియళ్లలో ఒక మగాడికి నలుగురు భార్యల్ని పెడుతున్నా, సినిమాల్లో ఆడది బట్టలిప్పి బజార్న పడ్డా వీళ్లకి పట్టదు. అంతా హిపోక్రసీ. పలాయనతత్వం. అసలవన్నీ ఆడవాళ్లేగా లొట్టలేసుకొని చూస్తున్నది. పల్లెటూళ్లకీ పాకిందీ జాడ్యం...'' అని ఎక్కువ మోతాదులోనే ఉపన్యాసం రంగరించాడు.

ఆయనవైపు పరిశీలనగా చూశాను. ఆయన బంతి లేకుండా ఫుట్‌బాల్ ఆడుతున్నాడని అనిపించింది. నాన్న రూపం, మనస్తత్వం, గతం గురించిన ఆలోచనలు మనసును ముసురుతున్నాయి.

*

నాన్నకి డెబ్భై ఏళ్లు దాటాయి. బట్టతల, చురుకు చూపులు, స్ఫురద్రూపం. ముక్కు సూటితత్వం. మాట పెళుసు. 'చెప్పే విషయం కొంచెం సౌమ్యంగా చెప్పొచ్చుగా. అంత కటువుగా చెప్పటమెందుకు,' అంటే ఒప్పుకోడు.

'మాట నాభి నుంచి రావాలిరా. పెదవిమీద నుంచి కాదు. చిత్తశుద్ధీ నిజాయితీ నిబద్ధతా ఉండాలి. మాడ్యులేషన్ లేని వాక్యానికి ఫోర్స్ ఎట్టా వస్తుంది? పొడిపొడి మాటల్తో చెప్తే పీకి పెరట్లో పారేస్తారు,' ఇదీ ఆయన తరహా.

నలభై ఏళ్లు ఉద్యోగం చేశాడు. చాలా చదివాడు. ఎన్నో డిగ్రీలూ తీసుకున్నాడు. పదహారో ఏటే తాతయ్య పోతే ముగ్గురు చెల్లెళ్లకీ పెళ్లీ పేరంటం నిర్వహించాడు. స్వశక్తితో ఎదిగిన వ్యక్తి. 'విశ్వనాథం సారంటే ఒక మేరువు. ఆయన్ని గురించి వర్ణించలేము,' అనిపించు కొన్నాడు. నాకూ, తమ్ముడికీ, అక్కయ్యకీ కూడా నాన్నే రోల్ మోడల్.

ఎటొచ్చీ ఈమధ్యనే ఈయనకి ఇంటి వ్యవహారాల్లో చాదస్తం ఎక్కువౌతున్నట్లనిపిస్తోంది.

మొన్న ఆదివారం... మాలతి, విష్ణు వచ్చారు. మాటలు సాగుతున్నాయి. మధ్యలో విష్ణు అన్నాడు. ''రవికి పైల్స్ తాతగారూ. బ్లీడింగ్ ఇబ్బంది పెడుతోంది. ఏదో మందు లేస్తున్నాంగానీ తగ్గట్లేదు. పిల్లవాడు బాధ పడుతున్నాడు.''

కొనసాగింపుగా మాలతి అంది. ''అసలు ప్రాబ్లెమ్... వాడు పిజ్జాలు, మసాలా పదార్థాలు తింటేనే వస్తోందిట.''

నాన్న వాళ్లిద్దర్నీ అదోలా చూసి ఠక్కున అన్నాడు. ''వాడు చిన్నవాడు. జిహ్వ చాపల్యం ఉంటుంది. పెద్దవాళ్లం కదా... మనమే బుద్ధి తెచ్చుకోవాలి. వాడికి అసలైన చికిత్స ఈ పదార్థాలు తినకుండా చూడటమే. మీరు తినేదీ వాడికి పెట్టేదీ అంతా జంక్‌ఫుడ్డేగా. గుట్టలు గుట్టలుగా ఆ చిప్స్ పేకెట్స్ ఎందుకు మీ డైనింగ్ టేబుల్ మీదా, సోఫాలో, దివాన్ మీదా... ఎక్కడపడితే అక్కడ...''

మాలతి సంగతేమోగానీ విష్ణు మొహం వివర్ణమై పోయింది. వాతావరణంలో ఒక్కసారిగా ముసురు కమ్మింది. ఆ తరువాత సంభాషణని వేరే అంశాల మీదికి మళ్లించాలని నేనెంత ప్రయత్నించినా పొడిపొడి మాటలుగానే తేలిపోయింది. కాస్సేపు కూచుని వెళ్లి పోయాడు విష్ణు.

*

ఇదీ ఇటీవలి నాన్న!

ఇప్పుడు జరుగుతున్నదీ భిన్నమైందేమీ కాదు.

హాలులో గాలి స్తంభించింది. చేతిలో ఉన్న దిన పత్రిక మీద కూడా తన చిరాకు ప్రదర్శిస్తున్నాడు నాన్న. ముఖకవళికలు ఈ విషయాన్ని చెబుతున్నాయి. నేనూ, అమ్మ, నాన్న... ఎవ్వరూ ఎవర్నీ పట్టించుకోకుండా వున్న ఈ వైనం చిత్రంగా ఉంది. అందరి మనసుల్లోనూ శత కోటి ఆలోచనలు. 'మౌనం కూడా ఒక భాషే,' అన్నది ఇందుకనేనా? ఒకరి మీద ఒకరికి అలతి కినుకా, అమిత కోపమా?! నేను మనసునీ చూపునీ అంతర్ముఖం చేసు కుంటున్నానా... నవ్వొచ్చింది.

"రండి. మనం భోంచేద్దాం... మాధవీ రా," అని పిలుస్తూ హాల్లోకొచ్చింది సరళ. హాల్లోనే మా డైనింగ్ టేబుల్. నేను లేచాను. సరళ వెనగ్గా అమ్మ కదిలింది. "నేనూ టిఫిన్ చేస్తున్నాను. మీ ఇష్టం. పెట్టమంటే పెట్టా," అన్నది నాన్న నుద్దేశించి. ఆయన మా అందరి వైపూ పరీక్షగా చూశాడు. ఆయన మనసులో జ్వలనం చూపుల్లో గోచరించింది నాకు. మరుక్షణం ఆయన లేచి తన గదిలోకి వెళ్లాడు.

ఆయన కాళ్లూ చేతులూ కడుక్కొని వస్తారేమో అనుకున్నాను... ఉత్కంఠతతో అటూ ఇటూ చూశాను. అమ్మకేసి సాలోచనగా పరికించాను టేబుల్ ముందు కూచుంటూ. ఆమె, "ఏమో ఆయన ఇష్టం," అన్నది గంభీరంగా.

మా గొంతుల్లోకి జారుతున్న ఆహారంలా హాల్లో నిశ్శబ్దమూ మునగదీసుకుంది.

నాన్న బయటికి వచ్చాడు. హాల్లో కూచుని రేడియోని ఆన్ చేశాడు. అదో చిన్న ట్రాన్సిస్టర్. సన్నగా పాట వినిపిస్తోంది.

ఇంతలో నా కొడుకు చందు వచ్చాడు. వాడు బి.టెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు, ఊరికి చాలా దూరంలోని కాలేజీలో. ఉస్సూరంటూ సోఫాలో కూచుని విసుగ్గా షూస్ తీసి ఓ మూలకు విసిరేశాడు. అవి రెండూ నాలుగువైపులకి పడినట్లు అక్కడొకటీ ఇక్కడొకటీ పడ్డాయి. మెళ్లో వేలాడుతున్న సెల్‌ఫోన్, చెవుల్లో ఉన్న ఇయర్‌ఫోన్, జేబులో నుంచి ఎంపిత్రీ ప్లేయర్ తీసి టీపాయ్ మీద పడేశాడు. రెండు చేతులూ వెనక్కి సాచుకొని సోఫాలో వాలిపోయాడు.

వాణ్ణి ఎగాదిగా చూశాడు నాన్న. "ఏమిట్రా చందూ... నువ్వూ నీ వాలకం. నజ్జు నజ్జుగా పీచులు పీచులుగా మడమల అడుక్కిపోయి ఆ ప్యాంటేమిటీ? కుష్టు ముండావాళ్లా ఏమిట్రా ఈ ఫ్యాషన్లు? మెళ్లో ఏమిటా తాళ్లు? షూస్‌ని ఒకచోట పొందిగ్గా విడవటం మనవల్ల కాదా జీవితంలో?"

వాడి సెల్ మోగింది. "తెల్లవార్లూ పొద్దుగూకులూ ఫోన్లో మాటలే మాటలు... లేదా మెసేజీలు," నాన్న మాటల్ని పట్టించుకోనట్టు అవన్నీ తీసుకొని తన గదిలోకి వెళ్లాడు చందు.

వాడు వెళ్తుండగా ఉన్నట్టుండి ఆయన చూపులు చందు వేసుకొన్న టీ షర్ట్ మీదకి మళ్లినై. ఛాతీ మీది అక్షరాలు పైకే చదివాడు.

'గర్ల్స్ ఆర్ లైక్ మెడిసిన్స్. దే డు హ్యావ్ యాన్ ఎక్స్‌పైరీ డేట్!'

నాన్న కోపం మీద గుగ్గిలం పడనే పడింది. మజ్జిగ అన్నంలోకి వచ్చానుగానీ నాకూ ముద్ద దిగటంలేదు. వీడు సహజంగా ఆయట కంటపడడు. కనిపిస్తే ఏదో ఒకటి పాయింటవుట్ చేస్తూనే ఉంటాడు. ఒకటే సణుగుడూ, నస. 'ఐ జస్ట్ కాన్ట్ బేర్,'... ఇదీ ఆయన్ని గురించి వాడు వాళ్ల అక్క దగ్గర వ్యక్తంచేసిన అభి ప్రాయం. నేనూ విన్నాను. అదీగాక, సాధారణంగా ఉదయం ఎనిమిదింటికి వాడు టిఫిన్ చేసి వెళ్లిపో తాడు. ఆ సమయంలో నాన్న పూజలో ఉంటాడు. అందుకని వీళ్ల చూపులు కలవవు. ఎప్పుడో సెలవు రోజుల్లో తప్ప... ఇవాళ దుర్దినం.

నాన్న కళ్లు అగ్నిగోళాలే అయ్యాయి. "మరీ రోత పుట్టిస్తున్నాయ్... ఈ ఇంటి వ్యవహారాలూ, పద్ధతు లూనూ. ఇలాగైతే వీడు భ్రష్టు పట్టిపోతాడు. జులాయి వేషాలూ, జులాయి వ్యవహారాలూ... పోయి ఓసారి వాడి రూమ్ చూడండి. దాన్నిండా దినపత్రికల పేజ్ త్రీ, పేజ్ ఫోర్ ఎట్రాక్షన్సే. చెప్తూనే ఉన్నాన్నేను. ఫిబ్రవరి ఏడో తేదీ సప్లిమెంట్‌ని చించుకొని దిండు పక్కన దాచుకొన్నాడు వీడు... యాక్సిడెంటల్‌గా ఏదో మేగజైన్ కోసం వెళ్తే కనిపించింది."

మాధవి ఉడికిపోతోంది. సరళకి అస్థిమితంగా వుంది. అమ్మ లేచి ప్లేట్ తీసుకొని వంటింట్లోకి వెళ్లిపో యింది.

అస్వస్థతగా ఉన్న మనసులు!

చాలా క్షణాల్ని కాలం తనలో కలిపేసుకుంది. ఎవరి గదుల్లోకి వాళ్లం వెళ్లబోతున్నాం. అప్పుడు అడిగాడు నాన్న. "నాకో కప్పు బూస్ట్ ఇవ్వు," అని. అమ్మ ఆయనకి బూస్ట్ ఇచ్చి గదిలోకి వెళ్లిపోయింది.

ఇప్పుడు హాల్లో నేనూ, నాన్నా మాత్రమే ఉన్నాం. పెద్ద కల్లోల కడలి మధ్య ద్వీపంలా ఉన్నాడాయన. "ఆ పిల్ల గది చూస్తే అదీ అంతే. వస్తువులు, పుస్తకాలు, బట్టలు... అన్నీ మంచం మీద, కుర్చీల్లో, తలుపు రెక్కలకీ... ఘోరం. పాతబడినవి, చిరిగిపోయినవీ కూడా చూసుకోకపోతే ఎట్లా? చేతికి ఏ డ్రెస్సు వస్తే అది వేసుకు పోతుంది. ఆ జీన్స్ ఒకటి వచ్చినై. మట్టీ దుమ్మూ ధూళీ అన్నీ ఆ రంగులో కలిసి పోతాయనే భరోసా. సరియైన జాకెట్లూ, గౌన్లూ లేవుగదా... ఏమిటిరా రామ్మూర్తీ... మన ఇళ్లల్లో కూడా ఇట్లా అయితే ఎట్లాగురా..." నెమ్మదిగా మాటల్లోకి ప్రవహించింది బాధ.

కొంత సమయం తీసుకొని, "మీరిలాంటివి పట్టించుకోకండి నాన్నా. ఎవరికి వారు గ్రహించు కొంటారు," అన్నాను.

ప్రస్తుతం ఆయన ఉన్న స్థితిలో నా సమాధానం లేక సముదాయింపు నా అల్ప ప్రజ్ఞకి తార్కాణమని నాకు తెలుసు. ఆయన మౌనంగా ఉండిపోయాడు. బడబాగ్ని అంటే అదేనా? ఒక ప్రశ్న నాలో పుట్టి నాలోనే అణిగిపోయింది. మెల్లగా లేచి ఆయన తన గదిలోకి వెళ్లిపోయాడు.

మర్నాడు ఉదయం, చాలా చిత్రంగా మా ఇంట్లో గాలి అంతా చందూ మీదే వీచింది. రాత్రి నాన్న మాట లకి సీరియల్ సాగింది.

సరళ కూడా వాడి మీద ఒంటికాలితో లేచింది. వాడి రూమ్‌లో ఉన్న 'స్టఫ్' అంతా వర్ణించింది. "వీడికి అడ్డమైన స్నేహాలూ అబ్బుతున్నై. తిరుగుళ్లూ ఎక్కు వయ్యాయి. లేకపోతే... ఎంత దూరపు కాలేజీ అయినా రాత్రి పదింటిదాకా పడుతుందా? అసలు కాలేజీ బస్సుకి డబ్బెందుకు కట్టనీయడు? యూజ్‌లెస్ ఫెలో..." ఇలా సాగింది ఆమె పెద్దరికపు హెచ్చరిక. ఇవన్నీ వినివిని చివ్వున లేచి వెళ్లిపోయాడు చందు.

ఎవరి పనుల్లోకి వాళ్లం వెళ్లిపోయాం.

ఆ రాత్రి సరళ నోరు విప్పింది. "ఎలాగైనా మామయ్యగారు ప్రతి చిన్న విషయానికీ బి.పి. పెంచు కొంటున్నారండీ. సెలవురోజు వచ్చిందంటే నాకేమిటో టెన్షన్‌గా ఉంటోంది.... ఆరోజెట్లా గడుస్తుందో అని. పేపర్ చదివితే చెత్తచెత్తగా మడుస్తారంటారు. ఏ పేజీకాపేజీ అక్కడోటీ ఇక్కడోటీ పడేయటమెందు కంటారు. వాష్‌బేసిన్‌లో నీళ్లు పోతున్నాయంటారు. కుర్చీల్ని అక్కడికీ ఇక్కడికీ లాక్కొని కూర్చుని మళ్లీ లేచి వెళ్లేటప్పుడు ఎక్కడివక్కడే వదిలేసిపోతారని చిరాకు పడతారు. ప్రతి చిన్న విషయానికీ, 'ఇవన్నీ కల్చర్‌లో భాగంగా రావాలని ఒక లెక్చర్ పీకుతారు.' పిల్లలు తెల్ల వార్లూ ఇంగ్లీష్ సినిమాలు చూస్తున్నారంటారు. రాను రాను ఆయన చాదస్తం పరాకాష్టకు చేరుతోంది..."

నేను విని ఊరుకొన్నాను. ఆ రాత్రంతా ఒకటే ఆలోచనలు. శనివారం వచ్చింది. అందరికీ సెలవు. అందరం హాల్లో ఉండగా చూసి చాలా నింపాదిగా మొదలెట్టాడు నాన్న.

"మనుషుల ఆలోచనలూ, ప్రవర్తనా త్వరత్వరగా మారిపోతున్నాయి. మాలాంటి వాళ్లం ఆ మార్పుని అదే వేగంతో అందుకోలేకపోతున్నాం. మేం పుట్టిందీ, పెరి గిందీ మనుషులుగా ఎదిగిందీ వేరువేరు వాతా వరణాల్లో. పదిహేనేళ్లొచ్చేదాకా కాళ్లకి చెప్పులు తెలీని వాడిని నేను. నా స్టార్ట్ ఇన్ లైఫ్ వేరు. మీది వేరు. ఒక సారి మాధవి చాలా విశదంగా చెప్పిందీ విషయం. 'నువ్వొక గుమాస్తా కొడుకుగా నీ జీవితం ప్రారంభిస్తే నాన్నొక మేనేజర్ కొడుకుగా మొదలెట్టాడు. నేనేమో ఒక జనరల్ మేనేజర్ కూతురుగా ప్రారంభించాను... చూశావా,' అని.

"నిజమే! అందువలన ప్రాధాన్యతలూ, అవ సరాలూ మారుతున్నాయి. రుచులూ, అభిరుచులూ భిన్నంగా ఉంటున్నాయి. మాధవిలాగా ఫ్రీగా నువ్వు గానీ, నేనుగానీ కాఫీడేకి వెళ్లగలమా? మీ ఆవిడలా మా ఆవిడ ఆరున్నర వరకూ పడుకోగలదా? ఎన్నిసార్లు వాళ్లి ద్దరికీ ఈ చర్చ జరిగిందో మనకు తెలుసు. కొత్తనీరు వచ్చి పాతనీరుని కొట్టేస్తూ ఉంటుంది."

ఒక్క క్షణం ఆగాడు. చుట్టూ చూశాడు. మళ్లీ చెప్పసాగాడు.

"అందుకని... ఒకరి ప్రవర్తన, నడత మరొకరి అనారోగ్యానికి కారణం కాకూడదు. మేము చాలా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాం. మీ అమ్మా నేనూ రేపు కేర్‌హోమ్‌లో చేరుతున్నాం. నిన్న వెళ్లి అన్ని ఫార్మా లిటీస్ పూర్తిచేసి వచ్చాం. మా వస్తువులూ సర్దుకొన్నాం."

మేమంతా షాక్ తిన్నాం. మొహామొహాలు చూసు కొన్నాం. ఈ కథకి నాన్న ఇలాంటి మలుపు ఇస్తాడని కలలో కూడా ఊహించలేదు. నేను సరళ వంక చూస్తే

ఆమె తన చూపుల్ని పరావర్తనం చేసింది. అమ్మ మౌనంగా ఉండిపోయింది.

ఆ రాత్రి మా బెడ్‌రూంలో లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. నిద్ర తెలీలేదు నాకు. ఏవేవో ఆలోచనలు. 'కొత్తనీరు వచ్చి పాతనీరుని కొట్టేస్తుంది!' అన్న నాన్న మాట పదేపదే గుర్తొస్తోంది. కేర్‌హోమ్‌లో చేరాలనే ఆలోచన కొత్తనీరా? నాన్న చెప్తూ ఉండే 'కేరెక్టర్ ఈజ్ ఏ ప్రాసెస్,' అంటే ఇదేనా?

తెరలు తెరలుగా... భవిష్యత్ దృశ్యాలూ చిత్రాలూ!!

అమ్మానాన్న కేర్‌హోమ్‌లో కుదురుకున్న పదిపదిహేను రోజుల తర్వాత ఒక సెలవు రోజున చందు అన్నాడు.

"మీకేమోగాని, వాళ్లు వెళ్లటం నాకు పెద్ద రిలీఫ్‌నిచ్చింది." నేను గతుక్కుమన్నాను.

రానున్న పరిణామాలకి నేటి సంకేతమా ఇది? నేను సరళకేసి చూశాను. ఆమె చందు వైపు చూసింది. వాడు చాలా తాపీగా, "అవును," అన్నాడు.

ఆ 'అవును' దేనికి వర్తిస్తుంది? నేను పైకి అనని నా ప్రశ్నకేనా?

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 18 మార్చి 2007*

